క్లుప్తంగా

ఘనంగా మరిడమ్మ పండుగ

దుమ్ముగూడెం: మండలంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా మరిడమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారి జాతర ముగిసిన 5వ రోజు నిర్వహించే మరిడమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో, బాణాసంచా పేలుళ్లతో ఊరేగింపుగా ములకపాడు గ్రామంలోని మరిడమ్మ చెట్టు దగ్గరకు వచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

గుండాల: నిత్యం ఎదుర్కొంటున్న గ్రామీణ వైద్యుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని, ప్రభుత్వం ఆర్‌ఎంపీల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ముక్తి సత్యం, గ్రామీణ వైద్యుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈనెల 26న ఖమ్మంలో జరుగు 20వ మహాసభను విజయవంతం చేయాలని చేయాలని కోరుతూ ఆదివారం మండల కేంద్రంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి శిక్షణ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టే వైద్య, ఆరోగ్య కార్యక్రమాలలో గ్రామీణ వైద్యులు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. మహాసభకు అధిక సంఖ్యలో గ్రామీణ వైద్యులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోరం సీతారాములు, గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపల్లి రమేష్, నవీన్, టీ.రాము, మహిమూద్, కె.భాస్కర్, ఎం.సత్యం, సోలం సతీష్,, కె.సతీష్, రాములు, నారాయణ, రాంబాబు, రసీద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

దమ్మపేట: మండల కేంద్రంలోని మల్లారం కాలనీ వాసులు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండల కేంద్రంలోని మల్లారం కాలనీలో అంతర్గతంగా రూ.35లక్షల విలువైన సీసీ రోడ్లను ఉపాధి హామీ నిధుల నుంచి ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మల్లారం కాలనీకి అనుసంధానంగా బీటీ రోడ్డును, రూ.90లక్షల అంచనాలతో ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలనీలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, సర్పంచ్ ఉయ్యాల చినవెంకటేశ్వరరావు, మహిళ మండలి సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు యార్లగడ్డ బాబు, అబ్దుల్‌జిన్నా, వీరబాబు, పానుగంటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

మణుగూరుటౌన్: కూనవరం గ్రామానికి చెందిన రైతులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సకిని బాబురావు సారథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఆ గ్రామానికి చెందిన రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ఆ గ్రామంలోని మాట్లాడుతూ.. ఏనిక గురువయ్యచేరువులో వర్షాకాలం చెరువునిండి పైనుంచి వచ్చే వరద వల్ల అలుగునీరు అంతా పంట పొలాల్లోకి రావడం జరుగుతుందన్నారు. చేరువులోకి వచ్చేనీరు నిలువ ఉండేలా ఆలుగు నిర్మాణం చేపట్టాలని రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలని కోరారు. వారి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేసినారు. కార్యక్రమంలో స్థానిక రైతులు సర్పంచ్ ఏనిక ప్రసాద్, కోటేశ్వరరావు, సకిని బాబురావు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెన్షన్ సౌకర్యాన్ని వినియోగించుకోండి

మణుగూరురూరల్: టీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో పరిధిలోని ఆర్టీసి ఉద్యోగులందరూ హైయర్ పెన్షన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ స్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైయర్ పెన్షన్ కావాలనుకునే ఆర్టీసి ఉద్యోగులు తమ ఆప్షన్ ఫామ్ పూర్తి చేసి బర్కత్పురా పీఎఫ్ కార్యాలయానికి నేరుగా పంపవచ్చని, లేదా డిపోలో అందజేయాలని సూచించారు. మార్చి 3వ తేదీలోగా సంబంధిత పత్రాన్ని బర్కత్పురా కార్యాలయ రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ అధికారికి అందజేయాలన్నారు. చివరి గడువు కంటే వారం రోజుల ముందుగానే డిపో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ అధికారికి ఆర్‌పీఏడీ ద్వారా నేరుగా సైతం పంపవచ్చన్నారు. పూర్తి వివరాలకు డిపోలో సంప్రదించాలని తెలిపారు.

గోదారిలో ప్రమాద ఘంటికలు

- అడుగంటుతున్న జలాలు
- తగ్గనున్న సాగు, తాగు నీటి లభ్యత
- పరిశ్రమలకూ తప్పని తిప్పలు
- 'సీతమ్మసాగర్' పూర్తయితే పరిష్కారం



నీరు అడుగంటడంతో వెలవెలబోతున్న గోదావరి

బూర్గంపాడు: జీవనది గోదావరిలో నీరు అడుగంటుతోంది. ఫిబ్రవరి నెలలోనే గోదావరి నీటిమట్టం తగ్గిపోతోంది. గోదావరిలో రోజురోజుకూ నీటి ప్రవాహం తగ్గిపోతుండటంతో రానున్న రోజులలో నీటి అవసరాలకు గడ్డుకాలం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలకు నీటివినియోగం పెరగటంతో పాటుగా గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే పరిస్థితులు కొనసాగితే గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసుకున్న తాగునీటి పథకాల నిర్వహణకు ప్రమాద ఘంటికలు మోగనున్నాయి. గోదావరిలో నీటిప్రవాహం తగ్గిపోతుండటంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో తాగునీటికి, సాగునీటికి, ఇతర పారిశ్రామిక అవసరాలకు ఇబ్బందులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గోదావరితో పాటు కిన్నెరసాని, పెదవాగు, ఎదుర్ల వాగు తదితర ఉపనదుల్లో నీరు అడుగంటుతోంది. చెరువులు, జలాశయాలలో కూడా నీటిమట్టం తగ్గిపోతుంది. జిల్లాలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలోని కుమ్మరిగూడెం వద్ద గోదావరి జలాల కోసం ఇంటెక్‌వెల్ నిర్మించారు. మిట్టగూడెం వద్ద వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కుమ్మరిగూడెం వద్ద దుమ్ముగూడెం ఆనకట్ట ఉండటం వలన గోదావరి నీరు ఎప్పుడు నిలిచివుంటుంది. అందుకే మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు ఇక్కడి నుంచే జిల్లాలో ఎక్కువ గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ పథకంలో తాగునీటిని అందిస్తున్నారు. ఇక్కడి నుంచే గోదావరి జలాలు రోజురోజుకూ తగ్గిపోవటంతో రానున్న రోజుల్లో నీటిలభ్యత ప్రశ్నార్థకంగా మారే అవకాశాలున్నాయి. గోదావరి జలాలను పొదుపుగా వాడుకుంటేనే మిషన్ భగీరథ పథకం సక్రమంగా నడుస్తుంది. ప్రస్తుతం గోదావరిలో ఉన్నటువంటి నీటి ప్రవాహాన్ని ఇటు పరిశ్రమలకు, తాగునీటికి, సాగునీటికి వినియోగించుకోవాలి. అశ్వాపురంలోని భారజల కర్మాగారం, బూర్గంపాడులోని ఐటీసీ పీఎస్‌పీడీ, మణుగూరులోని బీటీపీఎస్‌లు గోదావరి జలాలతోనే నడుస్తున్నాయి. అదేవిధంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో అనేక లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు సాగునీటిని అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను పొదుపుగా వాడుకోకుంటే రానున్న మూడునెలలు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే ప్రమాదముంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గోదావరిలో నీటి లభ్యత కోసం సీతమ్మసాగర్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టారు. ఈ బ్యారేజ్ నిర్మాణం పూర్తయితే మండు వేసవిలో కూడా గోదావరి నీటి లభ్యతకు ఢోకా ఉండదు. అప్పటి వరకు నీటి వృథాను అరికట్టి పొదుపు చర్యలు పాటిస్తేనే ఈ వేసవిలో పరిశ్రమల మనుగడకు, తాగు, సాగు నీటి అవసరాలకు నీటి కొరత లేకుండా ఉంటుంది.

నీరు బాగా తగ్గింది



ఈ ఏడాది గోదావరిలో నీరు తక్కువగా ఉంది. ఫిబ్రవరి నెలలోనే గోదావరిలో నీటి ప్రవాహం బాగా తగ్గిపోయింది. ఇంకా మూడు నెలలు ఎండాకాలం ఉంది. ఐదేళ్ల క్రితం కూడా ఇదే పరిస్థితులు వచ్చాయి. అప్పుడు హెవీవాటర్ ప్లాంట్ కొన్నిరోజులు నిలిపివేశారు.

– వల్లూరిపల్లి వంశీకృష్ణ, మాజీ ఎంపీటీసీ

నీటి పొదుపు పాటించాలి



గోదావరిలో నీరు తగ్గిపోవటం ఆందోళన కలిగిస్తుంది. ప్రతి ఒక్కరు నీటి పొదుపును పాటించాలి. నీటి వృథాను తగ్గించుకుంటే తాగు, సాగు నీరుకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. గోదావరిలో నీరు తగ్గుపోతుండటంతో భూగర్భ జలాలు కూడా పడిపోయే ప్రమాదం ఉంది.

– పేరాల శ్రీనివాస్, సారపాక

తాగునీటి సమస్యలు పరిష్కరించాలి



వద్దిపేటలో మాట్లాడుతున్న కుంజా సత్యావతి

చర్ల: గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారినికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి డిమాండ్ చేశారు. ప్రజాగోష బీజేపీ బరోసా కార్నర్ సమావేశంలో బాగంగా ఆదివారం మండలంలోని ఉంజుపల్లి, వద్దిపేట గ్రామాలలో ఆమె పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వద్దిపేట గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను సత్యావతి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేని స్థితిలో ప్రభుత్వం ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని ఆమె అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు విద్య వైద్యం, రహదార్ల నిర్మాణంపై చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ బిట్రుగుంట క్రాంతికుమార్ మండల అధ్యక్షుడు నక్కా కన్నారావు, నాయకులు లోకనాధం, రత్తయ్య, సోమరాజు, రాజేష్, సమ్మయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ లోని తాగునీటి సరఫరా సమయాన్ని కొంత మేరకు తగ్గించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోదావరి జలాలు అడుగంటిపోతున్న తరుణంలో నీటి సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందన్నారు. అందువల్ల నీటి సరఫరా సమయం తగ్గించి సరఫరా చేయడం జరుగుతుందని, మున్సిపాలిటీ ప్రజలు ఈవిషయం గమనించి సహకరించాలని కోరారు.

మసీదు ప్రారంభం

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదును ముస్లిం పెద్దలతో కలిసి ఆదివారం పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, మసీదు కమిటీ ముస్లిం పెద్దలు ఎస్‌కే.ఖాజ, ఎస్‌కే.ఖలీల్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, ఉప సర్పంచ్ ఎస్‌కే.అంకుషఅలి, నాయకులు ముత్తినేని వాసు, ఎస్‌కే.అజీజ్, యాకూబ్, సత్తార్, జాని, ఓరుగంటి రమేష్, వంకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్లు అందజేత

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల పరిధిలోని కళ్యాణపురం గ్రామ పంచాయతీలో రేగా యూత్‌కు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు క్రికెట్ కిట్‌ను అందజేశారు. గ్రామంలో గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హైమావతిని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ.4 వేలు ఆర్థిక సహాయం అందజేసి 25 కేజీల బియ్యం వితరణగా అందజేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయం భవనంకు నాయకులు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్సా దుర్గారావు, ఉపసర్పంచ్ లక్ష్మణరావు, వార్డు సభ్యులు రాజేష్, నాగేష్, రాణి, నాయకులు మామిళ్ల రాము, లక్ష్మణరావు, ఇసాక్, కన్నయ్య, నరేష్, బాబురావు, జయరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయండి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో ఈ నెల 25న, నియోజకవర్గస్థాయిలో సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆదివారం కమిటీ నాయకులు సమావేశమై తీర్మానం చేశారు. నియోజకవర్గంలోని లంబాడీ గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ నాయకులు ఇస్లావత్ వీరన్ననాయక్, గుగులోతు నీలవర్థ, గుగులోతు మోహన్, బాణోత్ రంగా, భూక్యా రాందాస్, అజ్మీరా రమేష్ పాల్గొన్నారు.

తారకరత్నకు నివాళి..

మణుగూరురూరల్: తెలుగు సినీ హీరో నందమూరి తారకరత్న మృతి పట్ల నందమూరి సేవా సమితి, కమ్మమహాజన సంఘం సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం అంబేడ్కర్ సెంటర్‌లో తారకరత్న చిత్రపటానికి ఆయా సంఘాల సభ్యులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తారకరత్న మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నందమూరి వారసుడిగా తెలుగు సినీ రంగంలో ప్రవేశించి హీరోగా పలు సినిమాలు చేసి అతి తక్కువ కాలంలో మంచి గుర్తింపు పొందిన తారకరత్న అకస్మాత్తుగా మరణించడం చాలా బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నందమూరి సేవా సమితి సభ్యులు, టిడిపి అభిమానులు వాసిరెడ్డి చలపతిరావు, చెన్నకేశవులు, నామా వెంకటేశ్వరరావు, మల్లిడి లోకేష్, దొడ్డపనేని రాంగోపాల్, పాలవాయి సుధాకర్, వేముల లక్ష్మయ్య, ఎలమాటి పూర్ణచందర్‌రావు, చందర్‌రావు, డి.తిరుపతి, కందిమల్ల సాయి, త్రిమూర్తులు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రమణయ్య, రాజయ్య, రమణ, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



తారకరత్నకు నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

ఛత్రపతి జయంతి వేడుకలు



మణుగూరురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తూ జైభవని, వీర శివాజీ, భారత్ మాతాకీ జై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. శివాజీ మహరాజ్ అఖండ భారతదేశంలో ఒక గొప్ప రాజు అని కొనియాడారు. ఆయన హయాంలో అందరూ సుభిక్షంగా ఉన్నారని,అందరికీ సమాన హక్కులు కల్పించారని అన్నారు. హిందూ ఐక్యత, అభివృద్ధి కోసం శివాజీ కృషి చేశారని, అయనను ఆదర్శంగా తీసుకొని పరిపాల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గిరిజన మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సతీష్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగబాబు, నియోజకవర్గ కన్వీనర్ త్రినాధరావు, అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను రామదండు హిందు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రామదండు ఆధ్వర్యంలో మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఛత్రపతి శివాజీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, ఆయన పోరాట పటిమను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రామదండు అధ్యక్షులు గిద్దా కొండయ్య, సభ్యులు బత్తుల సాయి, పందేటి ప్రభురాజ్, పెరుమాళ్ళ నాగరాజు, నాగుల చందు, మదన్, పానుగంటి గణేస్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ములకలపల్లిలో ఛత్రపతి శివాజీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కారంపూడి సత్యనారాయణరాజు, మండల కార్యదర్శి గొడ్ల రాజు, భజరంగ్‌దళ్ నాయకులు దేవేందర్, జగన్ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ 393వ జయంతి వేడుకలను విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. డిజే సౌండ్స్ నడుమ శివాజీ జెండాలను చేతబూని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సభ్యులు పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని నాయకులు అన్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు జంపన సీతారామరాజు, నాగేశ్వరరావు, బిక్షపతి, వెంకటేశ్వరరావు, మురళీమోహన్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధిపై సమీక్ష



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలో అభివృద్ధిపై ఆదివారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో ఇటీవల ప్రజల నుంచి పలు సమస్యలపై చర్చించారు. ప్రదాన రహదారిలో తీసుకోవాల్సిన చర్యలను గురించి అధికారులతో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు వాటి పురోగతి గురించి అడిగారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. మణుగూరు మున్సిపాలిటీని అత్యంత సుందరంగా తయారు చేయాలని కోరారు. అందుకు ప్రభుత్వం కావాలిసిన నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఏఈ సత్యనారాయణ, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌కు ఏర్పాట్లు పూర్తి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీకాలనీలోని భద్రాద్రి స్టేడియంలో 20వ తేదీన ప్రారంభం కానున్న సింగరేణి పాఠశాలల అథ్లెటిక్స్ మీట్స్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలోని అన్ని ఏరియా పాఠశాలల పిల్లల కోసం నిర్వహించే అథ్లెటిక్స్ మీట్‌కు వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లలు హజరు కావడం జరిగిందన్నారు. వారికి కావలసిన అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈపోటీల నిర్వాహణకు పీఈటీలను ఏర్పాటు చేయడంతోపాటు విద్యార్థులకు కావాలసిన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించే ఈపోటీల్లో విద్యార్థుల తమ ప్రతిభను చాటుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రారంభ వేడుకలకు సింగరేణీయులు వారి కుటుంబాలు, కార్మికులు కార్మికసంఘాల నేతలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ఆదివాసీలకు వైద్య శిబిరం



వైద్య పరీక్షల కోసం వచ్చిన ఆదివాసీలతో సీఆర్‌పీఎఫ్ అధికారులు, వైద్య సిబ్బంది

చర్ల: మండల సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ధర్మారంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్, కోబ్రా 204 బెటాలియన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని 60 మంది ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో సీర్‌పీఎఫ్ 151 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ లీలామోహన్, కోబ్రా 204 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ అమిత్‌పాల్, దీపాంకర్‌నగర్ యశ్వీర్ సింగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలకు అన్నీ విధాలుగా అండగా ఉండేందుకే పోలీసుశాఖ పని చేస్తోందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు సక్రమంగా అందించేందుకే తమ శాఖ కృషి చేస్తోందన్నారు. ఈ వైద్య శిబిరంలో సీఆర్‌పీఎఫ్ వైద్యాధికారి డాక్టర్ సాయి శశాంక్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి

భద్రాచలంటౌన్: తపాలా శాఖ పథకాలు, పొదుపు ఖాతాలపై ఉద్యోగులు ప్రజలలో అవగాహన కలిగించాలని తపాలా శాఖ ఏఎస్పీ సుచందర్ అన్నారు. పట్టణంలోని తపాలా శాఖ కార్యాయలంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం తపాలా కార్యాలయం పరిధిలోని పోస్టాఫీస్ ఉద్యోగులు ఐదు రోజుల పాటు అవగాహన మేళా నిర్వహించాలని తెలిపారు. పూర్తి వివరాలను ప్రజలు తెలుసుకునే విధంగా పట్టణంలోని ప్రధాన కార్యాలయంతో పాటు భూపతిరావు కాలనీ, రామాలయం తపాలా కార్యాలయలో ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు సేవింగ్స్, రికరింగ్, టర్మ్ డిపాజిట్లు, సుకన్య సమృదితో పాటు అనేక పొదుపు ఖాతాలలో పొదుపు చేయడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ శ్రీరామ్, మోహన్‌రావు, ఏపీఎం ప్రసాద్‌రెడ్డి, భాస్కర శాస్త్రీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



మణుగూరుటౌన్: రామానుజవరం ఆలయంలో కల్యాణం.. పాల్గొన్న సీఈ బిచ్చన్న దంపతులు



ములకలపల్లి: ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువు దీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన శివరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం నుంచే దేవాలయంలో హోమాలు, పూర్ణాహుతి, ఆలయ బలిహరణ, ధ్వజారోణము, రథోత్సవం, పర్యంకోత్సవం, స్వామి వారి త్రిశూల స్నానం మొదలైన పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. సాయంత్ర సమయంలో శ్రీ స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని జరిపించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలలో సత్తుపల్లి ఏసీపీ రామాంజనేయం, ఆలయ పునఃనిర్మాణకర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి గుట్టలపై ఉన్న వీరభద్రుడి కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. పూజారులు వీవీఆర్‌కే మూర్తి, వేణుగోపాలశర్మలు వేదమంత్రోత్సరణల నడుమ వందలాది మంది భక్తులు వీక్షిస్తుండగా కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ కమిటి బాధ్యులు బొర్రా సురేష్, ఇనగంటి నాగరత్నం ఆధ్వర్యంలో భక్తులకు సదుపాయాలు కల్పించారు.

బూర్గంపాడు: శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం అత్యంత కమనీయంగా రమణీయంగా సాగింది. మోతెగడ్డలోని వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం వేడుకగా సాగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో గోదావరి తీరం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. వేలాదిమంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి భక్తిపారవశ్యంతో పొంగిపోయారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని శివాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. వందలాదిమంది భక్తులు ఈ కల్యాణ క్రతువును వీక్షించి తరించారు. కల్యాణానికి ముందు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటాలు భక్తులను అలరించాయి.

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని పలు శివాలయాల్లో మహాశివరాత్రి పండుగ సందర్భంగా శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు దంపతులతోపాటు మణుగూరు కోర్టు మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు దంపతులు వేడుకల్లో పాలు పంచుకున్నారు. రామానుజవరంలోని భ్రమరాంబ సమేత వైద్యనాథ లింగేశ్వర స్వామి ఆలయంలో ఎస్సై పురుషోత్తం దంపతులు, బీటీపీఎస్ ఈపీ బి బిచ్చన్న దంపతులు కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. అశోక్‌నగర్‌లోని భవానీశంకర ఆలయంలో స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. పీవీకాలనీలోని శివాలయంలో సింగరేణి అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం, కమలాపురం, చినరాయిగూడెం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ప్రభలు ఏర్పాటు చేసుకుని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని కల్యాణ వేడుకలకు తరలివచ్చారు. అన్నారంలోని ధానధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో మేళతాళాలతో వాయిద్యాలతో నృత్యాలు శివస్తులతో సుమారు రెండువేల మంది భక్తులు తరలి వచ్చినారు. ఆలయంలో ఖభక్తుల కోసం దాన ధర్మట్రస్టు ఆధ్వర్యంలో గంటా రాధ అన్నదానం చేశారు. సుమారు వేయి మంది భక్తులకు అన్నప్రసాదాలను అందించారు.

ములకలపల్లి: శివపార్వతి దంపతుల ఊరేగింపు కార్యక్రమం ఆద్యంతం భక్తిపారవశ్యంతో సాగింది. మండలకేంద్రంలోని ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా శివరాత్రి పర్వదిన వేడుకలు నిర్వహించిన విషయం విదితమే. అర్ధరాత్రివేళ శాస్త్రోకంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించగా, ఆదివారం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ఇంటింట ఉత్సవ విగ్రహాలను స్వాగతిస్తూ బిందెలతో నీళ్లు గిస్తూ ఆహ్వానం పలికారు. కోలాట నృత్యాలు మేళతాళాలు, తీన్మార్ వాయిద్యాలు, డీజే డ్యాన్సుల నడుమ ఊరేగింపు కొనసాగింది. ఆలయకమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్, కమిటీ సభ్యులు పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, వీరగోపాల్ పాల్గొన్నారు.